
ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 65 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 4 +https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 08 అక్టోబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# బాలికపై అఘాయిత్యం అమానుషం: పవన్ కల్యాణ్

**పిఠాపురం పట్టణానికి చెందిన మైనర్ బాలికపై మాధవపురం డంపింగ్ యార్డు దగ్గర జరిగిన అఘాయిత్యం గురించి తెలిసి చాలా బాధ కలిగిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.**



పిఠాపురం, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): పిఠాపురం పట్టణానికి చెందిన మైనర్ బాలికపై మాధవపురం డంపింగ్ యార్డు దగ్గర జరిగిన అఘాయిత్యం గురించి తెలిసి చాలా బాధ కలిగిందని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అప్రమత్తమైన స్థానికులు నిందితుణ్ణి పట్టుకుని పోలీసులకు అప్పగించడంతో ఈ అఘాయిత్యం వెలుగులోకి వచ్చిందని, లేదంటే నిందితుడుఇ తప్పించుకోవడానికి ఆస్కారం కలిగేదని అన్నారు. ఈ అమానుష చర్యను సభ్యసమాజంలోని ప్రతి ఒక్కరూఖండించాలని పిలుపునిచ్చారు.ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలి. ఈ దుస్సంఘటన గురించి తెలిసిన వెంటనే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అధికారులను ఆదేశించాను. ప్రభుత్వపరంగా అన్ని విధాలా బాధితురాలికి, వారి కుటుంబ సభ్యులకు సహాయసహకారాలు అందచేస్తాము. ముద్దాయికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాము. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక జనసేన నాయకులను కూడా ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి, సహాయం అందించాలని ఆదేశించాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చంద్రబాబు భేటీ

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఢిల్లీలో రెండో రోజు కొనసాగుతోంది.**



దిల్లీ, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చంద్రబాబు భేటీ అయ్యారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. కేంద్ర మంత్రులు అమిత్, పీయూష్ గోయల్, నిర్మలా సీతారామన్, హర్దీప్సింగ్ పూరీలతో కూడా చంద్రబాబు భేటీ కానున్నారు.

# లావోస్ పర్యటనకు ప్రధాని మోదీ

**ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 10, 11 తేదీల్లో లావోస్లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.**



దిల్లీ, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు లావోస్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో ఆయన లావోస్లో పర్యటించనున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈసందర్భంగా మోదీ 21వ ఆసియాన్-ఇండియా సమ్మిట్, 19వ ఈస్ట్ ఏషియా సదస్సులో పాల్గొనున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఆసియాన్-ఇండియాకు లావోస్ అధ్యక్షత వహిస్తోంది.ఈ సమావేశాల్లో భారత్ వివిధ దేశాలతో భాగస్వామ్య ప్రాంతీయ ప్రాముఖ్యం కలిగిన అంశాలపై చర్చించే అవకాశముందని మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ శిఖరాగ్ర సమావేశాల్లో భాగంగా మోదీ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక విషయాలకు సంబంధించిన సమావేశాల్లోనూ పాల్గొనున్నారని సమాచారం. "భారతదేశంలో యాక్ట్ ఈస్ట్ పాలసీ వచ్చి దశాబ్దకాలం అవుతోంది. ఈ పాలసీ ఇండో-పసిఫిక్ అభివృద్ధికి కీలక స్తంభం వంటిది" అని విదేశాంగ శాఖ పేర్కొంది. కాగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం వేళ ప్రధాని నరేంద్రమోదీ ఇరుదేశాలను సందర్శించి.. యుద్ధం ముగింపు విషయంలో కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన ఇటలీ, అమెరికాలోనూ పర్యటించారు. ప్రస్తుతం మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు భారత పర్యటనలో ఉన్నారు. ఇందులోభాగంగా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రధాని మోదీతో విస్తృతస్థాయిలో సమాలోచనలు జరిపారు.

# కేంద్ర మంత్రి కుమారస్వామితో చంద్రబాబు భేటీ

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామితో భేటీ అయ్యారు.**



దిల్లీ, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు వరుస సమావేశాలతో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్తో భేటీ అయిన చంద్రబాబు.. తాజాగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో సమావేశమయ్యారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసానికి వచ్చిన కేంద్రమంత్రిని చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. సెయిల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ విలీనంపై కీలక చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వంపై బురదచల్లేందుకే వైకాపా తప్పుడు ప్రచారం: తెదేపా ఎమ్మెల్యేలు

**వరద నష్ట పరిహారం పంపిణీపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని ఉమ్మడి కృష్ణా జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు.**



విజయవాడ, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): వరద నష్ట పరిహారం పంపిణీపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని ఉమ్మడి కృష్ణా జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బురదచల్లేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ పాల్గొన్నారు.వరదలు వచ్చిన 15-20 రోజుల్లోనే బాధితులకు ప్రభుత్వం పరిహారం పంపిణీ చేసిందని గద్దె రామ్మోహన్ అన్నారు. 98 శాతం మందికి సాయం అందిందని.. సాంకేతిక కారణాలతో 2 శాతం మందికి అందలేదని చెప్పారు. త్వరలోనే వారికీ పరిహారం అందజేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. పరిహారం అందలేదనే ఫిర్యాదులు బాధితుల నుంచి రాకూడదని అధికారులకు ఆయన స్పష్టం చేశారని చెప్పారు.వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని.. ప్రజలకు వాస్తవాలు తెలియాలని వసంత కృష్ణప్రసాద్ అన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రైతులకు హెక్టారుకు రూ.25వేలు చొప్పున సీఎం చంద్రబాబు పరిహారం అందజేశారని చెప్పారు. ముంపునకు గురైన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోరికి రూ.25వేలు, ఫస్ట్ ఫ్లోరికి రూ.10వేల సాయం ఇచ్చారని తెలిపారు. సీఎం 11 రోజుల పాటు బస్సలోనే ఉంటూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ప్రజలను ఆదుకున్నారన్నారు.

# హుస్సేన్ సాగర్.. మూసీ పాపాలకు కాంగ్రెస్ కారణం కాదా?: జగదీశ్ రెడ్డి

**'చెరువుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమా?' అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు.**


హైదరాబాద్, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): చెరువుల విషయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమా?' అని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సవాల్ విసిరారు. గూగుల్ మ్యాప్స్ ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి చెరువుల పరిస్థితి ఎలా ఉందో చూద్దామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "భట్టి విక్రమార్క ప్రకటించిన జాబితా ప్రకారం ప్రభుత్వానికి అక్రమ నిర్మాణాలను కూల్చే దమ్ముందా? కూల్చివేతలతో ఇప్పటికే రూ. వెయ్యి కోట్లకు పైగా ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లింది. రూ.వందల కోట్లు కొల్లగొట్టి కడుపులు నింపుకోవాలనేది ప్రభుత్వం ఆలోచన. హుస్సేన్ సాగర్, మూసీ పాపాలకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదా?" అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు

# ఎగ్ పఫ్లకే రూ. మూడున్నర కోట్లు మింగేశారు: తెదేపా నేత పట్టాభి

**వరద బాధితులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం చంద్రబాబు పరిహారం అందించారని తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు.**



అమరావతి, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): వరద బాధితులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం చంద్రబాబు పరిహారం అందించారని తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఐదారు రెట్లు అదనంగా ప్రయోజనం కల్పించామని చెప్పారు. పరిహారం పంపిణీపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టాభి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరదలు వస్తే బాధితులకు గరిష్ఠంగా రూ.4వేల పరిహారం మాత్రమే ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో నీటమునిగిన ఇళ్లకు రూ.25వేల సాయం అందించారని చెప్పారు. వరద బాధితులకు ఎంత ఖర్చయిందో చెబుతున్నామన్నారు. ఏమీ దాచుకోమని.. చివరి వరకు దేనికి ఎంత ఖర్చుచేశామో స్పష్టంగా వెల్లడిస్తామని చెప్పారు."సచివాలయ భవనాలకు రంగుల కోసం గతంలో జగన్ ప్రభుత్వం రూ.3వేల కోట్లు తగలేసింది. సర్వేరాళ్లపై జగన్ బొమ్మకు రూ.700 కోట్లు, రుషికొండ ప్యాలెస్ పేరుతో రూ.600 కోట్లు, సాక్షిలో ప్రకటనలకు రూ.500 కోట్లు ఖర్చు చేశారు. ఎగ్ పఫ్లకే రూ.మూడున్నర కోట్లు మింగేశారు. ఇలా రంగులు, ప్రచార పిచ్చికి రూ.4,800 కోట్లు తగలేశారు. ప్రజలు కష్టాల్లో ఉంటే జగన్ ఏనాడైనా పరామర్శించారా? వరద బాధితులకు రూ.కోటి ఇస్తానని సెప్టెంబర్ 4న ప్రకటించారు.. ఇప్పటి వరకూ దిక్కులేదు." అని పట్టాభి వ్యాఖ్యానించారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# కుమారుడికి ఉరేసి.. తల్లి ఆత్మహత్య

ముక్కుపచ్చలారని కన్నకొడుకుని ఊపిరాడకుండా ఉరేసి తాను ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారకమైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదానోపోచంపల్లి మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.



భూదాన్పోచంపల్లి, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): ముక్కుపచ్చలారని కన్నకొడుకుని ఊపిరాడకుండా ఉరేసి తాను ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారకమైన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదానోపోచంపల్లి మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జడల రాజు అదే గ్రామానికి చెందిన జడల సోని (30)ని 12 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు పెళ్లిళ్ల శుభకార్యాలలో డెకరేషన్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం రాజు పని నిమిత్తం బయటకు వెళ్లగా తల్లిదండ్రులు చిన్నరావులపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోని పెద్దకుమారుడిని ఆడుకోమని చెప్పి బయటకు పంపింది. చిన్నకుమారుడు జడల రియాన్(6)ను బెడ్రూంలోకి తీసుకెళ్లి గడియ వేసుకుంది. మొదట కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపి అనంతరం ఆమె చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకొని ఇంటికి వచ్చిన భర్త తలుపులు బాదినా తీయకపోవడంతో పగులగొట్టి ఇంట్లోకి వెళ్లగానే విగత జీవులుగా కనిపించడంతో అరుపులు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారువచ్చి చూడటంతో అప్పటికే మృతిచెంది ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను మరణోత్తర పరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోని నాలుగు నెలలుగా మానసిక వేదనకు గురవుతోందని ఆసుపత్రుల్లో సైతం చూపిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మంత్రిపై పరువు నష్టం కేసు.. కోర్టులో నాగార్జున వాంగ్మూలం నేడు

మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్పై సోమవారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. తమ కుటుంబ గౌరవం, ప్రతిష్ట దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నాగార్జున పిటిషన్లో పేర్కొన్నారు.



హైదరాబాద్, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్పై సోమవారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. తమ కుటుంబ గౌరవం, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నాగార్జున పిటిషన్లో పేర్కొన్నారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది అశోక్ రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషన్ ను పరిశీలించి, వాదనలు విన్న న్యాయస్థానం అక్టోబరు 8న నాగార్జున వాంగ్మూలం నమోదు చేయాలని పేర్కొంది. దీంతో మంగళవారం ఆయన కోర్టుకు హాజరుకానున్నారు. ఇదే సమయంలో సాక్షుల స్టేట్మెంట్ను రికార్డ్ చేయాలని న్యాయవాది అశోక్రెడ్డి కోరారు. అనంతరం తదుపరి విచారణను న్యాయస్థానం మంగళవారానికి వాయిదా వేసింది.

# ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ

రూ.50వేలు లంచం తీసుకుంటూ సోమవారం మేడ్చల్ ఏఎస్ఐ ఏసీబీకి దొరికాడు. అధికారుల వివరాల ప్రకారం.. గౌడవెల్లి పరిధిలో బూసాకెత్ లో ఓ విల్లా యజమాని శర్మ తన ఇంట్లో ఇంటిరియల్ పనికి విశ్వనాద్ను సంప్రదించి...




మేడ్చల్, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): రూ.50వేలు లంచం తీసుకుంటూ సోమవారం మేడ్చల్ ఏఎస్ఐ ఏసీబీకి దొరికాడు. అధికారుల వివరాల ప్రకారం.. గౌడవెల్లి పరిధిలో బూసాకెత్ లో ఓ విల్లా యజమాని శర్మ తన ఇంట్లో ఇంటిరియల్ పనికి విశ్వనాథ్ను సంప్రదించి రూ.8లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా రూ.4లక్షలు చెల్లించాడు. చెల్లించిన డబ్బులకు తగినట్లుగా పనులు పూర్తి చేశాడు. మిగిలిన పనులు పూర్తిచేయాలని శర్మ ఒత్తిడి చేశాడు. ఒప్పందం ప్రకారం మిగిలిన డబ్బులు ఇవ్వాలని విశ్వనాథ్ కోరాడు. అతనిపై కోపంతో శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు నెలలక్రితం కేసు నమోదైంది. విశ్వనాథ్కు బెయిల్ ఇచ్చేందుకు రూ.2లక్షలకు ఏఎస్ఐ మధుసూదన్ రావు బేరం కుదుర్చుకొని.. ముందుగా రూ.10వేలు తీసుకున్నాడు. మిగిలిన డబ్బులు సోమవారం వరకు ఇవ్వాలని కోరడంతో విశ్వనాథ్ ఏసీబీని సంప్రదించాడు. ఏఎస్ఐ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి నగదుతో సహా అదుపులోకి తీసుకున్నారు.

# ఎన్నికలను లైట్గా తీసుకోవద్దు : హరియాణా ఫలితాల వేళ కేజ్రీవాల్ వ్యాఖ్య

ఎన్నికలను తేలిగ్గా తీసుకోకూడదని అతి విశ్వాసం పనికిరాదని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

దిల్లీ, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్లద్మీపార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఒంటరిగా బరిలోకి దిగి చతికిలబడింది. ఈ క్రమంలో అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల్లో అతివిశ్వాసం పనికిరాదని వ్యాఖ్యానించారు. "ఎన్నికలు సమీపిస్తున్నాయి. వాటిని మనం తేలిగ్గా తీసుకోకూడదు. ఎప్పుడూ అతివిశ్వాసంతో ఉండకూడదనేది ఈ ఎన్నికలు నేర్పిన పాఠం. ప్రతి ఎన్నిక, ప్రతి స్థానం కఠినమైనదే. విజయం కోసం కష్టపడి పనిచేయాలి. అంతర్గత పోరు ఉండకూడదు" అని పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వంత రాష్ట్రం హరియాణాలో ఆప్ ఖాతా తెరవలేదు. హరియాణాలో భాజపా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా పయనిస్తోంది. ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఆప్.. ఈ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలడం భాజపాకు లాభించిందనే చెప్పొచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసివస్తుందని అంచనా వేసిన హస్తం పార్టీ ఆశలు తలకిందులయ్యాయి. చివరకు ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తారుమారయ్యాయి. ఇక త్వరలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఫలితాలతో ఆప్ అప్రమత్తంగా వ్యవహరించనుంది.



# విజయవాడ న్యాయవాదుల బస్సుకు ప్రమాదం.. ఒకరి మృతి, 11 మందికి గాయాలు

రాజస్థాన్లోని అజ్మేర్లో విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల బస్సుకు ప్రమాదం జరిగింది.

అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): రాజస్థాన్లోని అజ్మేర్లో విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదుల బస్సుకు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, 11 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.విజయవాడ నుంచి బార్ అసోసియేషన్ న్యాయవాదులు రెండు బస్సుల్లో అజ్మేర్ విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఆగి ఉన్న ట్రక్కును న్యాయవాదుల బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న అక్కడికక్కడే మృతిచెందారు. రాజేంద్రప్రసాద్ సహా 11 మందికి గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## జ్యోత్స్న మృతిపై సీఎం చంద్రబాబు సంతాపం

అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): ప్రమాదంలో న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ భార్య జ్యోత్స్న మృతి పట్ల ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులను చైతన్యపరిచే కార్యక్రమాలను జ్యోత్స్న నిర్వహించారని కొనియాడారు. బస్సు ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.




# తెదేపాలోకి ఇద్దరు వైకాపా కార్పొరేటర్లు

కర్నూలు నగరపాలక పరిధిలో 9, 12 వార్డులకు చెందిన వైకాపా కార్పొరేటర్లు మంత్రి టీజీ భరత్ సమక్షంలో సోమవారం తెదేపాలో చేరారు. 9, 12 వార్డు కార్పొరేటర్లు పుల్లమ్మ, అన్నెపోగు క్రాంతికుమార్లు పార్టీలో చేరగా మంత్రి వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.



కర్నూలు, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): కర్నూలు నగరపాలక పరిధిలో 9, 12 వార్డులకు చెందిన వైకాపా కార్పొరేటర్లు మంత్రి టీజీ భరత్ సమక్షంలో సోమవారం తెదేపాలో చేరారు. 9, 12 వార్డు కార్పొరేటర్లు పుల్లమ్మ, అన్నెపోగు క్రాంతికుమార్ లు పార్టీలో చేరగా మంత్రి వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెదేపాతోనే అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో పలువురు కార్పొరేటర్లు వైకాపాను వీడి తెదేపాలోకి వస్తున్నారని చెప్పారు. తనకు పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే వైకాపా నేతలు కర్నూలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్టీలో చేరిన కార్పొరేటర్లు మాట్లాడుతూ మంత్రి టీజీతోనే వార్డుల్లో అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకే వైకాపాను వీడి తెదేపాలో చేరుతున్నట్లు తెలిపారు.

## రూ.2.30 కోట్ల కరెన్సీతో

# గంగానమ్మకు అలంకారం

తెలుగు రాష్ట్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గ్రామదేవత గంగానమ్మను రూ.2.30 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో గంగానమ్మ విగ్రహం చుట్టూ భారీగా నోట్ల కట్టలు, కాయిన్స్ ఉంచారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

# ఈడీ విచారణకు హాజరైన మాజీ ఎంపీ అజహరుద్దీన్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు.



హైదరాబాద్, అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హెచ్సీఏలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఇటీవల ఈడీ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీంతో మంగళవారం హైదరాబాద్లోని ఆ సంస్థ కార్యాలయంలో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా అజహర్ మాట్లాడుతూ తనపై వచ్చినవి తప్పుడు ఆరోపణలని చెప్పారు.హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి రూ.20 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అజహర్కు ఈడీ నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశించింది.

# 'పట్టు' పట్టిన వినేశ్ ఫొగాట్.. హరియాణా ఎన్నికల్లో విజయం

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫొగాట్ విజయం సాధించారు.



అక్టోబర్ 8 (రిపబ్లిక్‌న్యూస్): కుస్తీ యోధురాలు, కాంగ్రెస్ నాయకురాలు వినేశ్ ఫొగాట్ హరియాణా ఎన్నికల్లో విజయం సాధించారు. జులానా నియోజకవర్గం నుంచి గెలుపొందారు. పారిస్ ఒలింపిక్స్ వేదికగా తృటిలో పతకాన్ని చేజార్చుకున్న ఆమె.. ఎన్నికల సమరంలో మాత్రం ఓటమిని దరి చేరనివ్వలేదు. ఈ స్థానంలో బరిలో నిలిచిన భాజపా అభ్యర్థి యోగేశ్ కుమార్, ఆప్ అభ్యర్థి కవితా రాణి ఆమె చేతిలో పరాజయం పాలయ్యారు.వినేశ్ విజయంపై రెజ్లర్ బజరంగ్ పునియా అభినందనలు తెలుపుతూ పోస్టు పెట్టారు. "విజయం సాధించిన భారత పుత్రిక వినేశ్ ఫొగాట్కు అభినందనలు. ఇది జులానా సీటుకు సంబంధించిన పోటీ కాదు. అలాగే ఏదో మూడు నాలుగు స్థానాలు, పార్టీల మధ్య పోరు అసలే కాదు. ఈ పోరు బలమైన అణచివేత శక్తుల మధ్య జరిగింది. అందులో వినేశ్ గెలిచింది" అని ఆమె ఫొటోను షేర్ చేశారు. తన సమీప భాజపా ప్రత్యర్థిపై ఆరువేల ఓట్ల తేడాతో ఆమె గెలుపొందారు. అక్టోబర్ 5న హరియాణాలో ఎన్నికలు జరగ్గా.. ఈ రోజు ఫలితాలు వెలువడుతున్నాయి. ఈ రాష్ట్రంలో భాజపా మూడోసారి అధికారాన్ని చేపట్టే దిశగా పయనిస్తోంది. తొలుత కాంగ్రెస్ ఆధిక్యాన్ని ప్రదర్శించినా.. తర్వాత కమలం దాటికి నిలవలేక రెండో స్థానానికి పరిమితమైంది.ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో వినేశ్ ఫొగాట్ అనర్హతకు గురైన సంగతి తెలిసిందే. 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఖాళీ చేతులతో ఆమె స్వదేశానికి చేరుకోవాల్సి వచ్చింది. ఆ పరిణామం యావత్ భారతావనిని బాధించింది. అనంతరం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించిన ఆమె కాంగ్రెస్ లో చేరి రాజకీయ ప్రయాణాన్ని ఆరంభించింది.

# జాబ్ మేళా ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్

నంద్యాల, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, బొమ్మల సత్రం నందు డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి , డిస్టిక్ ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ సోమశివారెడ్డి , డిస్టిక్ స్కిల్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , కళాశాల వైస్ ప్రిన్సిపల్ శైలజా రాణి , స్కిల్ హబ్ కోఆర్డినేటర్ పార్వతి , 36 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ, చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయని దాదాపు 415 కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు.




నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు. ఈ ఆశయానికి ా ారు. అనుగుణంగా మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# అయ్యా.... తహాశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీర్చే వారు లేరా...!

● కార్యాలయంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రుద్రవరం, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): అయ్యా... రుద్రవరం మండల తహాశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత తీర్చే వారే లేరా అని కార్యాలయానికి వచ్చే ప్రజలు వేడుకుంటున్నారు. కార్యాలయంలో సిబ్బంది కొరత కారణంగా సకాలంలో పనులు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్, డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ) సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే కార్యాలయంలో తహాశీల్దార్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ తహాశీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు రైతులకు విద్యార్థులకు సకాలంలో పనులు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు చిన్న చిన్న సమస్యలు పరిష్కరించుకునేందుకు కార్యాలయానికి వచ్చే ప్రజలు కార్యాలయం వద్ద గంటలు తరబడి నిరీక్షించి సిబ్బంది లేకపోవడం సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరాశతో వెను తిరిగి వెళుతున్నారు. వారం రోజుల క్రితం వరకు కార్యాలయంలో తహాశీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించేవారు, ఆర్ ఐ స్థానం ఖాళీగా ఉండడంతో జూనియర్ అసిస్టెంట్ కే ఇన్చార్జి ఆర్ఐగా బాధ్యతలు అప్పగించడంతో కార్యాలయం వచ్చే ప్రజలకు రైతులకు కొంతమేరకైనా పనులు జరిగేవి. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల కారణంగా కార్యాలయంలో



విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహాశీల్దారును, సర్వే డిప్యూటీ తహసిల్దార్ ను జూనియర్ అసిస్టెంట్ ను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. సర్వే డిప్యూటీ తహాశీల్దార్ గా ఒకరిని నియమించి తిరిగి మళ్ళీ ఆర్డీవో కార్యాలయానికి అటాచ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో డిప్యూటీ తహాశీల్దార్, సర్వే డిప్యూటీ తహాశీల్దార్, ఆర్ ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలకు రైతులకు సకాలంలో పనులు పరిష్కారమయ్యే పరిస్థితి కనబడడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న స్థానాలలో సిబ్బందిని నియమించి పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో పనులు పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులు సంక్రాంతిలోగా పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

● ఈ నెల 14 వ తేది నుండి 20 వ తేది వరకు పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు

● వీసి ద్వారా కలెక్టర్లలతో సమీక్షించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

కడప, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): జిల్లాల్లో గ్రామ సభల్లో ఆమోదిందించిన పల్లె ప్రగతికి మౌలిక సదుపాయాలైన సిమెంట్ రోడ్లు, డబ్ల్యు. బి. యం. రోడ్లు, బి.టి రోడ్లు, మేకలు,గొర్రెలు,కోళ్ళ పెంపకం షెడ్లు వంటి ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులను వచ్చే సంక్రాంతి లోపల పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు.మంగళవారం రాజధాని అమరావతి నుంచి ఉపాధి హామీ పనులు, గ్రామ సభలు, పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు తదితర అంశాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తో పాటు సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు. వీసీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 13వేల పైగా గ్రామపంచాయతీలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారుల సహకారంతో గత నెల ఆగస్టు 23 వ తేదీన గ్రామ సభలు విజయవంతంగానిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఈ నెల 14 వ తేది నుండి 20 వ తేది వరకు పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలను కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు.గ్రామ సభల్లో ఆమోదం పొందిన ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులను ఈ వారోత్సవాలలోప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రారంభించాలని సూచించారు. గ్రామాల్లో మొదలు పెట్టే ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులను పారదర్శకతతో, జవాబు దారితనంతో చేపట్టాలన్నారు. ఆమోదం పొందిన ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనుల్లో సిమెంట్ రోడ్లు, బిటి రోడ్స్ హార్టికల్చర్, గోకులాలను ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి పనులు చేపట్టాలని అందుకు సంబంధించిన కార్యాచరణపై.. దిశానిర్దేశం చేశారు.విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ.ఈ జిల్లాలో గ్రామసభల్లో



ఆమోదం పొందిన 983 అన్ని పనులకు 100%శాంక్షన్ తీసుకున్నామని తెలిపారు. అలాగా ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించి అప్లోడ్ విషయంలో ఎలాంటి టెక్నికల్ ఇష్యూస్ లేవని తెలిపారు. ఈనెల 14వ తేదీ నుండి 20 తేది వరకు చేపట్టబోయే "పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో" జిల్లాలోని ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ఆమోదం పొందిన పనులకు భూమి పూజలు చేపడతామని తెలిపారు. జిల్లాలో చేపట్టబోయే పనుల వివరాలు, పూర్తి చేసిన పనుల వివరాలను డిస్ప్లే బోర్డులను అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసామని అలాగే కొన్ని స్ట్రాటజిక్ లోకేషన్స్ (ప్రముఖమైన ప్రదేశాలు) లో కూడా డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఎలాంటి సిమెంట్, ఇసుకసంబంధించిన సమస్యలు లేవని ఈనెల అక్టోబర్ 16 నుంచి మరి కొన్ని ఇసుక రీచ్ లు అందుబాటులోకిరానున్నాయని తెలిపారు. వచ్చే సంక్రాంతి లోపల ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ కింద ఆమోదం పొందిన పనులన్నీ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి విజయకుమార్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి, గనులు భూగర్భ శాఖ ఆర్.ఐ. విమలమ్మ, డిపిఓ రాజ్యలక్ష్మి ఆర్.డబ్ల్యూ ఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 6వ రోజు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారు

అక్టోబర్ 8 (రిపబ్లిక్న్యూస్): జిల్లా పరిధిలోని నందవరంలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు దేవి శరన్నవరాత్రులలో మంగళవారం ఆరవ రోజు సందర్భంగా అమ్మవారికి నిత్యార్చన విశేష పూజా క్రతువులు నిర్వహించి యాగశాల నందు ఆవాహిత దేవతా పూజలు, విశేష పూజా క్రతువులు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తి ఆరవ రోజు కాత్యాయని అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు.



# శ్రీ దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆలయంలో శ్రీ దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దుర్గా దేవి అమ్మవారి చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలి వారు కోరారు. మాజీ ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి మాట్లాడుతూ.ప్రత్యేకంగా దసరా శరన్నవరాత్రి వేడుకల పర్వదినాలలో శ్రీ దుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరు కావడం ఏంతో భాగ్యంగా భావిస్తున్నామన్నారు. బ్రహ్మాండమైన వెండి తొడుగును అమ్మవారి విగ్రహానికి ఏర్పాటుచేసిన ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలకు ఆ అమ్మవారి



కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని కోరారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు బసవేశ్వర్ రెడ్డి,రవికుమార్ రెడ్డి, రషీద్ ఎంపిటిసి, షఫీ ,అనిల్ రెడ్డి, ప్రసాదు ,కటారి బాలుడు,పరమేశ్వర రెడ్డి, ఐలూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ స్థలాలను కాపాడండి లేదా పేదలకు పంచండి

●సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్




నంద్యాల అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): ప్రభుత్వ భూముల్లో పేదలు జానెడు స్థలాన్ని ఆక్రమిస్తే ఎక్కడ లేని చట్టాలు తీసుకవచ్చే అధికారులు నంద్యాల పట్టణంలోని నడిబొడ్డున వున్న మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించి యదేచ్ఛగా రూమలు కడుతున్న మునిసిపల్ అధికారులు కళ్ళుండి గుడ్డివారిగా నటిస్తున్నారని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ ఆరోపించారు అనంతరం రవిరాజ్ ఎఐయస్ ఎ నాగార్జున లు మాట్లాడుతూ నంద్యాల జిల్లాగా మారిన దగ్గర నుండి భూ కబ్జాలు ఎక్కువైయాయన్ని వాటిని నియంత్రించడంలో అధికారులు విఫలమైయ్యారని వారు దుయ్యబట్టారు భూ ఆక్రమణ దారులకు అధికారులు ఒంత పాడుతున్నారని ఆయన ఆరోపణలు చేశారు. భూ ఆక్రమణ దారులకు వంత పాడే అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి వున్న తమ ఆదినంలో వున్న మునిసిపల్ స్థలాలను పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. మునిసిపల్ అధికారులు పాలకొమ్మ చెట్టు స్థలంలో అనదికారంగా కట్టిన వాటిని కూల్చివేసి స్థలాన్ని వారి ఆదినంలోకి తీసుకొని యెడల సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మునిసిపల్ స్థలాలలో పేదలను కలుపుకొని జెండాలు పాతి పేదలకు పంచుతామని వారు హెచ్చరించారు. పేదలకు ఒక న్యాయం రాబంధులకు ఒక న్యాయమా అని వారు మునిసిపల్ అధికారులను సూటిగా ప్రశ్నించారు. పేదప్రజలకు ఒక న్యాయం భూ ఆక్రమణ దారులకు ఒక న్యాయమా చట్టం న్యాయం అందరికి సమానంగా ఉంటాయని ఇకానైనా మునిసిపల్ అధికారులు కపటనిద్రా మేలుకోకపోతే జరిగే పరిణామలకు అధికారులే బాధ్యత వ్యవహరించాల్సీ వస్తుందని వారు హితువు పలికారు.

# దసరా నవరాత్రి ఉత్సవాలలో చండీయాగం

నంద్యాల, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్):కసెట్టీసుబ్బమ్మ బాలాజీ మర్చెన్ కమిటీ కళ్యాణమండపం ఆలయంలో దసరా శరన్నవ వేడుకల సందర్భంగా చండీయాగం నిర్వహించడం జరిగినది. 30 జంటలు యాగంలో పాల్గొనైనది, ఆలయ అర్చకులు ఈశ్వర్ నిఖిలేష్ శర్మ అర్చకత్వంలో యాగం ఘనంగా నిర్వహించి దేశం సుభిక్షంగా ఉండాలి సకాలంలో వర్షాలు కురవాలని, పర్యావరణ పరిరక్షణ నిమిత్తం కూడా హెూమం నిర్వహించినట్లు కసట్టి చంద్ర తెలిపారు.



# వృత్తి విద్య కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు... సంగెపు నాగేశ్వరరావు ప్రిన్సిపాల్

● ఐటీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ట్రైనింగ్

రుద్రవరం, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): వృత్తి విద్య కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి ఇంటర్మీడియట్ ఐటీ విద్యార్థులకు ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఆర్ నాగులవరం గ్రామ సచివాలయంలో రుద్రవరంలోని మీసేవ కేంద్రంలో మంగళవారం వృత్తి విద్య కోర్సులలో ఇంటర్న్ షిప్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులలో (వొకేషనల్) ఇంటర్న్ షిప్ కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాలకు చెందిన పదవ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు దసరా సెలవులలో పది రోజులపాటు పీఎం శ్రీ స్కూల్లోని వృత్తి విద్య కోర్సులలో ఇంటర్న్ షిప్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటి మరియు ఐటీఈఎస్ ట్రేడ్ కు చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది అన్నారు. విద్యార్థులు ఐటీ రంగంలో జరిగే రోజువారి కార్యక్రమాలు అలాగే నైపుణ్యాలను తెలుసుకుంటున్నారని తెలిపారు. ఐటీ రంగంతోనే విద్యార్థులకు మంచి ఉద్యోగ భవిష్యత్తు ఉంటుందని అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వృత్తి విద్య కోర్సు ఉపాధ్యాయుడు హరికృష్ణ, విద్యార్థులు, సచివాలయం సిబ్బంది, మీసేవ సిబ్బంది పాల్గొన్నారు.




# ఆటో బోల్తా.. ముగ్గురు కూలీల పరిస్థితి విషమం

ఆంధ్ర కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో ఆటో బోల్తాపడడంతో సుమారు 30 మంది కూలీలకు గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.

హొలహర్వి, అక్టోబర్ 8 (రిపబ్లిక్ న్యూస్): ఆంధ్ర కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లో ఆటో బోల్తాపడడంతో సుమారు 30 మంది కూలీలకు గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామానికి చెందిన కూలీలు ఆలూరు, ఆస్పరి మండలాలకు పత్తి విడిపించేందుకు వెళుతుండగా వాహనం టైరు పగిలి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒక బాలుడు, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. గాయపడిన వారిని మోకా, బళ్లారి ఆసుపత్రులకు తరలించారు.

L.K.R COLLEGE OF NURSING
(Affiliated to Dr. N.T.R U.H.S Vijayawada)
Near J.V.R.R. ITI, V.C. Colony, Nandyal - 518502
అడ్మిషన్లు జరుగుచున్నవి
4 సం॥ల B.Sc., నర్సింగ్ కోర్స్,
అర్హత: ఇంటర్ Bi.P.C., మరియు ఒకేషనల్ నర్సింగ్ పాస్ అయిన విద్యార్థినీ, విద్యార్థులు EAPCET అర్హత సాధించిన వారు అర్హులు.
(మేనేజ్‌మెంట్ కోటా నందు కొన్ని సీట్లు కలవు)
పూర్తి వివరములకు:
85200 10739, 85200 23866
జె.లక్ష్మీకాంత రెడ్డి, ఛైర్మన్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1891 : నవలా రచయిత, నాటక కర్త భోగరాజు నారాయణమూర్తి జననం (మ.1940).
- 1895 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు అడివి బాపిరాజు జననం (మ.1952).
- 1902 : ఆర్థిక శాస్త్రవేత్త, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి, వాసిరెడ్డి శ్రీకృష్ణ జననం (మ.1961).
- 1918 : తెలుగు సినిమా నటుడు పేకేటి శివరాం జననం (మ.2006).
- 1932 : భారతీయ వైమానిక దళం ఏర్పాటయింది.
- 1935 : భారత క్రీడాకారుడు మిల్కా సింగ్ జననం.
- 1963 : తెలుగు నటుడు చిలకలపూడి సీతారామాంజనేయులు మరణం (జ.1907).
- 1976 : తెలుగు రచయిత, కవి, అనువాదకుడు కందుకూరి రామభద్రరావు మరణం (జ.1905).
- 1979 : భారత స్వాతంత్ర్య సమర యోధుడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మరణం (జ.1902).

(చిత్రంలో)


నారాయణమూర్తి


అడివి బాపిరాజు


వాసిరెడ్డి శ్రీకృష్ణ


పేకేటి శివరాం


వైమానిక దళం


మిల్కా సింగ్


సీతారామాంజనేయులు


రామభద్రరావు


జయప్రకాశ్ నారాయణ్

# 'వేట్టయన్'.. ఆ మార్పులు చేయాలని నేనే అడిగా: రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'వేట్టయన్'. ఈ సినిమా విషయంలో కథలో మార్పులు సూచించినట్లు రజనీకాంత్ చెప్పారు. కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరినట్లు తెలిపారు.



రజనీకాంత్ హీరోగా టి.జె జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రం 'వేట్టయన్'. భారీ అంచనాల మధ్య దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఈ సినిమా కథ గురించి రజనీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టి.జె జ్ఞానవేల్ మొదట తీసుకువచ్చిన కథకు రజనీ మార్పులు సూచించారట. దానిలో కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయమని కోరారట. కుమార్తె సౌందర్య సిఫార్సు మేరకు రజనీకాంత్ 'వేట్టయన్' కథను విన్నట్లు చెప్పారు. "టి.జె. జ్ఞానవేల్ దర్శకత్వంలో వచ్చిన 'జైభీమ్' సినిమా నాకెంతో నచ్చింది. కానీ, గతంలో జ్ఞానవేల్ తో ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాలేదు. 'వేట్టయన్' కథ వినమని సౌందర్య నాకు చెప్పడంతో విన్నాను. బాగుందనిపించింది. అయితే, ఈ సినిమా తీయడానికి చాలా డబ్బు ఖర్చు-వుతుంది. అందుకే కథలో కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరాను. 10 రోజుల సమయం అడిగాడు. 'కమర్షియల్ సినిమాగా మారుస్తాను. కానీ, నెల్సన్ దిలీప్‌కుమార్, లోకేశ్ కనగరాజ్ సినిమాగా మార్చలేను. నా శైలిలో ప్రేక్షకులకు నచ్చేలా ఈ కథను మారుస్తాను' అని జ్ఞానవేల్ చెప్పాడు. 'నాకు అదే కావాలి.. లేదంటే లోకేశ్, దిలీప్ ల దగ్గరకే వెళ్లేవాడిని కదా' అని చెప్పా. 10 రోజుల తర్వాత కథలో మార్పులు చేసి తీసుకొచ్చాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను" అని రజనీకాంత్ తెలిపారు. ఈ సినిమాకు అనిరుధ్ మాత్రమే సంగీత దర్శకుడిగా ఉండాలని జ్ఞానవేల్ పట్టుపట్టినట్లు రజనీ గుర్తుచేసుకున్నారు. తమిళనాడులో గతంలో జరిగిన ఓ బూటకపు ఎన్ కౌంటర్ నేపథ్యంతో దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ ఈ సినిమాని తెరకెక్కి-స్తున్నారు. ఇది రజనీకాంత్కు 170వ చిత్రం. ఆయన ఇందులో రిటైర్డ్ పోలీసు అధికారిగా కనిపించనున్నట్టు సమాచారం. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికాసింగ్, మంజు వారియర్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. తెలుగులోనూ అదే పేరుతో విడుదల కానుంది.

## రిపబ్లిక్ సినిమా CINEMA

# 'దేవర 2'.. ఫ్యాన్స్‌కు ప్రామిస్ చేసిన దర్శకుడు

ఎన్టీఆర్ తాజా చిత్రం 'దేవర మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొరటాల శివ మాట్లాడుతూ దీని సీక్వెల్ పై స్పందించారు.



కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన సినిమా 'దేవర'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకొని ఎన్టీఆర్ అభిమానుల్లో జోష్ నింపింది. దీనికి కొనసాగింపుగా పార్ట్ 2 రానుందని దర్శకుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర 2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దీంతో అభిమానుల అంచనాలు రెట్టింపయ్యాయి. "పార్ట్ 2లో జాన్వీ పాత్ర అసాధారణంగా ఉంటుంది. ఆశ్చర్యపోతారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్లా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు సీట్ ఎడ్జికి వస్తారు. ఒక దర్శకుడిగా నేను పార్ట్ 2 విషయంలోనూ ఎంతో నమ్మకంగా, ఆసక్తిగా ఉన్నాను. కథలో అసలు మలుపు పార్ట్ 2లోనే ఉంది. ప్రతీ పాత్ర హైలో ఉంటుంది. ఎన్టీఆర్ అభిమానులందరికీ ఒక్కటే చెబుతున్నా.. పార్ట్1 లో మీరు చూసింది 10 శాతమే.. రెండో భాగంలో 100శాతం చూస్తారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుంది. కొన్ని సన్నివేశాలు మీరు జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అందిస్తాయి. ఈ విషయంలో ప్రామిస్ చేస్తున్నాను. తారక్ నటన గురించి చెప్పాల్సిన అవసరం లేదు. అతడు తన పాత్రకు జీవం పోస్తాడు' అని కొరటాల శివ 'దేవర 2' విషయంలో ధీమా వ్యక్తంచేశారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ కూడా 'దేవర 2' గురించి మాట్లాడిన సంగతి తెలిసిందే. మొదటిభాగం చిత్రీకరణ సమయంలోనే పార్ట్ 2లో కొన్ని సన్నివేశాలు షూట్ చేసినట్లు చెప్పారు. ఫస్ట్ పార్ట్ మంచి విజయం సాధించడంతో వారి బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందని తెలిపారు. కథ సిద్ధంగా ఉందని.. మెరుగులు దిద్దాలన్నారు. కొరటాల శివ 'దేవర' కోసం ఎంతో కష్టపడినట్లు తెలిపారు. సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'దేవర' ఇప్పటివరకు రూ.466 కోట్లు వసూలు చేసింది. త్వరలో రూ.500కోట్ల క్లబ్లోకి చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

## రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# నా కుమారుడికి రూ.5 కోట్లు, పుణెలో ఫ్లాట్ ఇవ్వండి :ఒలింపిక్ విజేత తండ్రి డిమాండ్

పారిస్ ఒలింపిక్స్ విజేత అయిన షూటర్ స్వప్నిల్కు ఇచ్చిన ప్రైజ్మనీపై అతడి తండ్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



పారిస్ ఒలింపిక్స్‌లో షూటింగ్లో స్వప్నిల్ కుశాలె కాంస్యపతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మహారాష్ట్ర యువ షూటర్కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రైజ్మనీపై అతడి తండ్రి సురేశ్ కుశాలె తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తన కుమారుడికి కేవలం రూ.2 కోట్ల ప్రైజ్మనీ మాత్రమే ఇచ్చారని, హరియాణా ప్రభుత్వం వారి అథ్లెట్లకు ఇచ్చిన మొ-త్తంతో పోలిస్తే చాలా తక్కువ అని వ్యాఖ్యానించారు. స్వప్నిల్కు రూ.5 కోట్లతో పాటు పుణెకు చెందిన బలేవాడీలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దగ్గర్లో ఓ ఫ్లాట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కొల్హాపుర్లో ఆయన మీడియాతో మాట్లాడారు. "మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానం ప్రకారం కాంస్యపతకం సాధించిన ఒలింపిక్ విజేతకు రూ.2 కోట్ల ప్రైజ్మనీ దక్కుతుంది. 72 సంవత్సరాల్లో రాష్ట్రం నుంచి ఒలింపిక్ పతకం సాధించిన రెండో వ్యక్తి స్వప్నిల్. అలాంటి పరిస్థితుల్లోను ఈతరహా విధానం ఎందుకు..? ఈ క్రీడల్లో హరియాణా నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ఒకరు పతకాలు సాధించారు. మన రాష్ట్రంతో పోల్చుకుంటే హరియాణా చిన్న రాష్ట్రం కానీ ప్రైజ్మనీ మాత్రం భారీగా ఇచ్చింది. స్టేడియం దగ్గర్లో అతడికి ఫ్లాట్ కేటాయిస్తే.. అతడు ప్రాక్టీస్కు వెళ్లడానికి సులభంగా ఉంటుంది. 50 మీటర్లు 3 పొజిషన్స్ రైఫిల్ షూటింగ్ ప్రాంతానికి స్వప్నిల్ పేరు పెట్టాలి" అని తెలిపారు. తొలిసారి విశ్వక్రీడల్లో పోటీపడిన ఈ మహారాష్ట్ర షూటర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్లో కంచు పతకం సాధించాడు. ఈ విభాగంలో ఒలింపిక్ పతకం గెలిచిన భారత తొలి షూటర్గా చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్లో ఆరంభంలో తడబడినా తిరిగి పుంజుకున్న కుశాలె పోడియంపై నిలబడ్డాడు. మూడు భిన్న భంగిమల్లో 50 మీటర్ల దూరంలోని లక్ష్యానికి గురిపెట్టడాన్ని 50మీ. రైఫిల్ 3 పొజిషన్స్ అంటారు. 29 ఏళ్ల స్వప్నిల్ మహారాష్ట్రలోని కొల్హాపూర్ సమీపంలోని కంబల్వాడి గ్రామంలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. ఈ షూటర్ 2015 నుంచి సెంట్రల్ రైల్వేలో టికెట్ కలెక్టర్గా పని చేస్తున్నాడు. ఈ విజయం తర్వాత రైల్వేశాఖ అతడికి ప్రమోషన్ ఇచ్చింది.

## ఫ్యాషన్

అధిక బరువు కారణంగా కొంతమంది మహిళలు చీరలు కట్టడానికి వెనుకాడతారు. అయితే, సరైన చీరను ఎంచుకోవడం ద్వారా మీరు నాజుగ్గా కనిపించవచ్చు. ప్లస్ సైజ్ మహిళల కోసం కొన్ని చీరలు ముందుకు తీసుకువస్తున్నాం.

చీరకట్టు భారతీయ సంస్కృతికి అద్దం పడుతుంది. ఫంక్షన్, పండుగ, శుభకార్యం ఏదైనా సరే.. అందరిలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవాలంటే చీర కట్టాల్సిందే. చీరకట్టులో ఉన్న అందం.. మిగతా డ్రెస్సులు వేస్తే రాదు. ఎన్ని డ్రెస్సింగ్ స్టైల్స్, ఫ్యాషన్ ఉన్నా... చీరకున్న క్రేజే వేరు. చీరకట్టులోనే మగువలు అందంగా ఉంటారు. మహిళలకు చీరలంటే ఎంతో ఇష్టం. విదేశీ మహిళలు కూడా భారతీయ చీరలపై ఆసక్తి చూపుతారు. చీర అనేది ఏ సందర్భంలోనైనా ధరించవచ్చు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మెజారిటీ మహిళలు ప్రతిరోజూ చీరలనే ఎక్కువగా కట్టుకుంటారు. ఎందుకంటే ఆడవాళ్ల అసలైన అందం కనిపించేది చీరకట్టులోనే.



అయితే, కొందరు మహిళలు ఎక్కువ బరువు ఉన్నామనే కారణంతో చీర ధరిచడం మానేస్తారు. చీరలో చాలా లావుగా ఉన్నారని ఎవరైనా ట్రోల్ చేస్తారన్నది వారి భయం. అయితే, అధిక బరువున్న మహిళలు టెన్షన్ పడాల్సిన పనిలేదు. కొన్ని చీరలు ధరిస్తే ప్లస్ సైజు మహిళలు కూడా స్లిమ్ లుక్‌లో కనిపిస్తారు. ఇంతకీ ఆ చీరలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

# లావుగా ఉన్న మహిళలకు ఈ చీరలు బెస్ట్.. కడితే నాజుగ్గా, అందంగా కనిపిస్తారు.




### మైసూర్ సిల్క్ చీర..

తమ వద్ద ఉన్న చీరల్లో ఒకటైనా మైసూర్ సిల్క్ చీర ఉండాలన్నది ప్రతి మగువ చీర. మైసూర్ సిల్క్ చీర ఫాబ్రిక్ మిమ్మల్ని స్లిమ్ గా మార్చడంలో చాలా సహాయపడుతుంది. మైసూర్ సిల్క్ శారీ ఫాబ్రిక్ భారీగా ఉంటుంది. కానీ అది చాలా మృదువైనది. దీని కారణంగా ఇది వంపులపై సాఫీగా జారిపోతుంది. మైసూర్ సిల్క్ శారీ ముదురు రంగుల్లో కూడా లభిస్తుంది. దీంతో.. ఈ చీర మీ రూపాన్ని మెరుగుపరుస్తుంది. మీరు నగలు ధరించిన చీర లుక్ మాత్రం భారీగా కనిపించదు.



### టస్సార్ సిల్క్ చీర..




పశ్చిమ బెంగాల్‌కి చెందిన టస్సార్ సిల్క్ చీర యొక్క ప్రత్యేకత ఏమిటంటే దాని ఫాబ్రిక్ చాలా తేలికగా ఉంటుంది. అంతేకాకుండా, సహజమైన కర్ల్స్ కూడా ఇందులో సులభంగా కనిపిస్తాయి. ఇది శరీరంపై సులభంగా జారిపోతుంది. సాదా సరళమైన ఈ డిజైన్ శారీ సొగసైన రూపాన్ని మగువలకు అందిస్తుంది.

### చారల చీర..

చారలతో కూడిన చీరలు అధిక బరువు ఉన్న మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఏ రకమైన సరే తేలికపాటి ఫాబ్రిక్‌ను ఎంచుకోండి. కానీ, అది చారలతో ఉండాలి. చారలతో కూడిన ప్రింట్‌ను కొనుగోలు చేయండి. నిజానికి ఈ రకమైన చీరలు మీ శరీర బరువును దాచడానికి పనిచేస్తాయి. ఈ చారల చీర చూసేవారి దృష్టిని మరల్చగలదు. దీంతో.. అందమైన రూపం మహిళల సొంతమవుతుంది.



### నెట్ శారీ..



నెట్ లేదా టిష్యూ చీరలు చాలా సులభంగా శరీరానికి సరిపోతాయి. నెట్ శారీ ధరించడం ఓ అద్భుతమైన ఎంపిక. నిజానికి ఈ ఫాబ్రిక్ మీ శరీరానికి అతుక్కుపోయి నాజూకు రూపాన్ని ఇస్తుంది. లావుగా ఉన్న మహిళలు ఈ చీరలు ధరిస్తే వారు నాజూగ్గా కనిపిస్తారు. ఈ ఫాబ్రిక్ మీ శరీర భాగాలకు అందమైన రూపాన్ని ఇస్తుంది.

### జార్జెట్ చీర..



మీరు తేలికైన చీరలు ధరించడానికి ఇష్టపడి.. లావుగా ఉన్నామన్న కారణంతో వెనుకంజ వేస్తున్నారా..? అయితే, జార్జెట్ చీర మీకు అద్భుత ఎంపిక కాగలదు. ఈ చీర చాలా సరళంగా ఉంటుంది. ఈ చీర కట్టుకుంటే లావుగా ఉన్న ప్రాంతాలు చాలా సులభంగా కవర్ అవుతాయి. ఈ చీర శరీర ఆకృతిని అందంగా కనిపించేలా చేస్తుంది.

### ఫిజిక్ ఆధారంగా చీరలు సెలెక్ట్ చేసుకోండి..

అన్నీ చీరలే కదా.. ఏదైనా ఒకటే అనుకోవద్దు. కొన్ని చీరలు మీకు సెట్ కాకపోవచ్చు. చీరల్ని మన ఫిజిక్ ఆధారంగా ఎంచుకోవాలి. బరువు, ఎత్తును బట్టి ఎంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల అందంగా కనిపిస్తారని వారు తెలిపారు. అదే విధంగా.. లోపల ధరించే పెట్టీ కోట్స్, లంగాలు కూడా చీర రంగుకు మ్యాచింగ్‌లోనే ఉండాలే చూసుకోండి. ఇలా చేయడం మీరు మరింత అందంగా కనిపిస్తారు. అలాగే, చీరలకు ఏ నగలు సెట్ అవుతాయో అవే వాడటం మంచిది. అలాగే, చీరల కలర్‌కి సూటయ్యే ఫుట్ వేర్ వేయాలని నిపుణులు చెబుతున్నారు.

గమనిక: ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.